RNI TELTEL2024/89323

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

2

నిజామాబాద్ | సెప్టెంబర్ 22 మంగళవారం 2026 | సంపుటి : 3 | సంచిక : 228 | పేజీలు : 8 | వెల రూ. 6.00/- | ఎడిటర్ : రాచమల్లు

Nizamabad | TUESDAY SEPTEMBER 22 2026 | VOL:3 | ISSUE: 228 | PAGES:8 | Rs. 6:00 | EDITOR: Rachamallu Madhavi

# రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్... శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన

ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ

ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

నెల రోజుల్లో అన్నిచోట్లా పనులు మొదలని ప్రకటన




శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదుర్గంలో 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. మల్కంచెరువు వెనుక భాగంలో 2.85 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్స్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఆయన ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందేవరకు ఈ పథకం దశలవారీగా నిరంతరాయంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లను నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. నగరానికి దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తే, తమ ప్రభుత్వం అత్యంత విలువైన ప్రాంతాల్లోనే పేదలకు గృహవసతి కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా, కేవలం పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను కేటాయిస్తున్నామని తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. విచారణలో అనర్హులుగా తేలిన ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన వారికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తామని, బేస్‌మెంట్ పూర్తి చేసిన ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని చెప్పారు. అయితే, ఇళ్లు మంజూరై ఉండి, ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించని అనర్హుల కేటాయింపులను రద్దు చేస్తామని, ఆ స్థానంలో అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం

బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ

సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ

అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి,

(మిగతా 4వ పేజీలో..)




## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే

సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి

మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన

ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

(మిగతా 2వ పేజీలో..)



## పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

రష్యా చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా కొత్త చట్టం

25 ఏళ్ల క్రితం నాటి పోఖ్రాన్ ఆంక్షల తరహా పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళన

దేశ ఇంధన భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం

భారత్–అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి అధిక మొత్తంలో ముడి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకునే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

(మిగతా 2వ పేజీలో..)



## 31 సినిమాలకు సెన్సార్ మినహాయింపు కట్.. కేంద్రంపై శశిథరూర్ ఫైర్

కేరళ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 31 చిత్రాలకు సెన్సార్ మినహాయింపు నిరాకరణ

ఇది భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి అని కేంద్రంపై శశిథరూర్ విమర్శ

నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరిన కేరళ చలనచిత్ర అకాడమీ

రాజకీయ, సామాజిక అంశాలపై ఉన్న చిత్రాలను తిరస్కరించినట్లు ఆరోపణలు




కేరళలో నిర్వహించనున్న 18వ అంతర్జాతీయ డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఐడీఎస్ఎఫ్ఎఫ్‌కే)లో ప్రదర్శించాల్సిన 31 చిత్రాలకు సెన్సార్ మినహాయింపు ఇచ్చేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిరాకరించడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అని ఆయన అభివర్ణించారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు 'ఎక్స్' వేదికగా శశిథరూర్ ఒక విజ్ఞప్తి చేశారు. అధికారుల నిర్ణయాన్ని పక్కనపెట్టి, సదరు చిత్రాలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఇటువంటి చర్యల వల్ల అంతర్జాతీయ స్థాయిలో సృజనాత్మక కళాకారులు, చిత్రనిర్మాతల దృష్టిలో భారత ప్రతిష్ఠ మసకబారుతుందని ఆయన హెచ్చరించారు.

(మిగతా 2వ పేజీలో..)

## బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు


బంగాళాఖాతంలో అల్పపీడనం, రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశం

పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన

లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

(మిగతా 2వ పేజీలో..)



## లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

తమిళనాడు సీఎం విజయ్ లండన్ పర్యటనపై అన్నామలై విమర్శలు

బ్రిటన్‌ను చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థగా అభివర్ణించిన అన్నామలై

విదేశాల బదులు రాష్ట్రంలోని పారిశ్రామిక నగరాల్లో పర్యటించాలని సూచన

భారత్ కంటే యూకే ఆర్థిక వ్యవస్థ బలమైనదని వ్యాఖ్య

స్థానిక వ్యాపారులకు పన్ను మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వానికి హితవు



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ఇటీవల లండన్‌లో పర్యటించడంపై రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)ను 'చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థ'గా అభివర్ణించిన ఆయన, విదేశాల నుంచి కాకుండా రాష్ట్రం నుంచే పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. మధురైలో మీడియాతో మాట్లాడిన అన్నామలై.. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు 4.1 ట్రిలియన్ డాలర్లు కాగా, యూకే ఆర్థిక వ్యవస్థ కేవలం 3.4 ట్రిలియన్

(మిగతా 2వ పేజీలో..)

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కొత్త పార్టీలకు క్షేత్రస్థాయే అసలు పరీక్ష

రాజకీయాల్లో కొత్త పార్టీని ప్రకటించడం ఒక అడుగు మాత్రమే. దానిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, గ్రామస్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేయడం అసలు పరీక్ష. తెలంగాణలో కొత్త రాజకీయ వేదికల ఏర్పాటు, వాటి విస్తరణపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలంటే క్షేత్రస్థాయిలో బలమైన పునాది అవసరం.కొత్త పార్టీకి ప్రారంభంలో సభలు, సమావేశాలు, నాయకుల చేరికలు రాజకీయంగా కనిపించే ప్రధాన అంశాలు. అయితే సభకు వచ్చిన జనసమీకరణను మాత్రమే పార్టీ బలంగా పరిగణించడం సరికాదు. సభ తర్వాత ఆ పార్టీకి గ్రామాల్లో కమిటీలు ఏర్పడ్డాయా? ప్రజా సమస్యలపై కార్యకర్తలు పనిచేస్తున్నారా? స్థానికంగా నాయకత్వం ఎదుగుతోందా? యువత, మహిళలు, వివిధ సామాజిక వర్గాలకు అవకాశాలు లభిస్తున్నాయా? అన్న అంశాలే దీర్ఘకాలంలో పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. తెలంగాణ రాజకీయాల్లో మహిళా నాయకత్వంపై కూడా ప్రస్తుతం చర్చ పెరుగుతోంది. మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే అంశం కేవలం ఎన్నికల సమయంలో టికెట్ల పంపిణీకే పరిమితం కాకూడదు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్ణయాధికారంలో వారికి స్థానం కల్పించాలి. రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారితో పాటు సామాన్య నేపథ్యం నుంచి ఎదిగే మహిళలకు కూడా అవకాశాలు అందుబాటులోకి రావాలి. అప్పుడే మహిళా ప్రాతినిధ్యం సంఖ్యాపరమైన అంశాన్ని దాటి నాయకత్వంగా రూపాంతరం చెందుతుంది.అదే సమయంలో యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ప్రయత్నాలు కూడా పెరుగుతున్నాయి. కొత్త తరం ఓటర్ల ఆలోచనలు, ఆకాంక్షలు గతంతో పోలిస్తే మారాయి. ఉద్యోగాలు, విద్య, ఉపాధి, స్థానిక అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన వంటి అంశాలపై యువత ఎక్కువగా స్పందిస్తోంది. అందువల్ల కేవలం వయసులో యువకులను లేదా యువతులను నాయకులుగా ప్రకటించడం సరిపోదు. ప్రజా సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం, రాజకీయ అవగాహన, క్షేత్రస్థాయి అనుభవం కూడా అవసరం.

స్థానిక నాయకత్వమే కీలకం

రాష్ట్రస్థాయి నాయకుడికి ఎంత ప్రజాదరణ ఉన్నా ప్రతి నియోజకవర్గంలో అదే స్థాయిలో పార్టీ బలపడుతుందని చెప్పలేం. స్థానిక రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, పార్టీ సంస్థాగత నిర్మాణం ఎన్నికల్లో కీలకంగా మారుతాయి. అందుకే కొత్త రాజకీయ పార్టీలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఎంపిక నుంచి గ్రామస్థాయి కమిటీల వరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది.ప్రత్యేకంగా ఇప్పటికే బలమైన రాజకీయ పార్టీలు ఉన్న ప్రాంతాల్లో కొత్త పార్టీకి స్థానం సంపాదించడం సులభం కాదు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఏళ్లుగా ఉన్న కార్యకర్తల వ్యవస్థ, స్థానిక నాయకత్వం, ఓటర్లతో సంబంధాలు కొత్త పార్టీలకు ప్రధాన సవాలుగా ఉంటాయి. ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకోవడం ద్వారా తాత్కాలికంగా బలం పెరిగినట్లు కనిపించినా, సొంతంగా నాయకత్వాన్ని తయారు చేసుకోకుండా దీర్ఘకాలిక రాజకీయ నిర్మాణం సాధ్యం కాదు. ప్రజా సమస్యలే రాజకీయాలకు కేంద్రం కావాలి.కొత్త పార్టీ అయినా, అధికార పార్టీ అయినా, ప్రధాన ప్రతిపక్షమైనా చివరకు ప్రజలు అడిగేది తమ సమస్యలకు పరిష్కారమే. రైతులకు సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, గ్రామాల్లో రహదారులు, విద్య, వైద్యం వంటి అంశాలపై పార్టీలు స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందుంచాలి.పార్టీల మధ్య నాయకుల విమర్శలు, ఆరోపణలు రాజకీయాల్లో సహజమే. కానీ రాజకీయ చర్చ అంతా వ్యక్తిగత విమర్శల చుట్టూనే తిరిగితే ప్రజలకు ప్రయోజనం ఉండదు. ప్రత్యామ్నాయ విధానాలు, అభివృద్ధి నమూనాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పోటీ పెరగడం ప్రజాస్వామ్యానికి ఉపయోగకరం.

చేరికల కంటే ప్రజల విశ్వాసమే ముఖ్యం

ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి నాయకులు మారడం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. అయితే నాయకుల చేరికల సంఖ్యనే ప్రజాబలానికి కొలమానంగా తీసుకోవడం తొందరపాటు అవుతుంది. కార్యకర్తలు, స్థానిక నాయకులు పార్టీ మారడానికి రాజకీయ అవకాశాలతో పాటు వ్యక్తిగత, స్థానిక కారణాలు కూడా ఉండవచ్చు. అందువల్ల ఏ ప్రాంతంలోనైనా రాజకీయ మార్పు వచ్చిందనే నిర్ధారణకు ఎన్నికల ఫలితాలు, దీర్ఘకాలిక ప్రజా స్పందన వంటి స్పష్టమైన ఆధారాలు అవసరం.కొత్త రాజకీయ శక్తుల ఆవిర్భావం ప్రజాస్వామ్యంలో సహజ ప్రక్రియ. అవి ఎంతకాలం నిలబడతాయి, ఎంతవరకు విస్తరిస్తాయి అన్నది మాత్రం నాయకుల ప్రకటనలతో నిర్ణయించబడదు. ప్రజల మధ్య నిరంతరం ఉండటం, స్పష్టమైన విధానాలు రూపొందించడం, సమర్థమైన నాయకత్వాన్ని తయారు చేయడం, అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలే వాటి రాజకీయ ప్రయాణాన్ని నిర్ణయిస్తాయి. చివరకు రాజకీయాల్లో ఏ పార్టీకి అయినా నిజమైన పరీక్ష ఎన్నికల ముందు జరిగే భారీ సభ కాదు.. ప్రజల మధ్య సంపాదించుకున్న విశ్వాసమే.

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

# రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు.జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# బంగాళాఖాతంలో రేపటికి వాయుగుండం.. ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## లండన్ కాదు.. కోయంబత్తూరు, మధురైకి వెళ్లండి: సీఎం విజయ్‌కు అన్నామలై సూచన

డాలర్లు మాత్రమేనని గుర్తుచేశారు. కేవలం 1 శాతం వృద్ధి రేటుతో నెమ్మదిగా సాగుతున్న దేశానికి పెద్ద ప్రతినిధి బృందంతో వెళ్లడం వల్ల ప్రయోజనం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ అక్కడి నుంచి పెట్టుబడులు వచ్చినా, అవి ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న భారతీయ కంపెనీల అనుబంధ సంస్థల నుంచే వస్తాయని, కొత్తగా విదేశీ మూలధనం రాదని అభిప్రాయపడ్డారు.విదేశీ పర్యటనలకు బదులుగా, ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పారిశ్రామిక కేంద్రాలైన కోయంబత్తూరు, మధురై, తూత్తుకుడి వంటి ప్రాంతాల్లో పర్యటించాలని అన్నామలై సలహా ఇచ్చారు. స్థానిక వ్యాపారవేత్తలతో సమావేశమై, వారి వ్యాపార విస్తరణకు పన్ను మినహాయింపులు వంటి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అలాగే, దేశంలోని ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల నుంచి కూడా పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సీఎం విజయ్ ఆరు రోజుల యూకే పర్యటన ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 10,000కు పైగా ఉద్యోగాలు లభించాయని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అన్నామలై ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వానికి పనిచేయడానికి కొంత సమయం ఇవ్వాలని చెబుతూనే, స్థానిక పరిశ్రమల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు.

# పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

మొదటి పేజీ తరువాయి)

సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం నిబంధనలు పాటించని దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. ఈ పరిణామం రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం పేరు మీద "లిండ్సే ఒ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" పేరుతో ఈ చట్టాన్ని రూపొందించారు. అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు డెమొక్రాట్లు, రిపబ్లికన్లు అనే తేడా లేకుండా ఉభయపక్షాల మద్దతు లభించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోగా రష్యా నుంచి ముడి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేస్తున్న మొదటి ఐదు దేశాలలో ఒకటిగా ఉండి, తమ దిగుమతులను తగ్గించుకోని పక్షంలో ఆ దేశంపై సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఉంటుంది.గత కొన్నేళ్లుగా భారత్, రష్యా నుంచి చౌక ధరలకు లభించే ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలల్లో అయితే, భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా రష్యా నుంచే రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అమెరికా తాజా చట్టం భారత్‌ను నేరుగా లక్ష్యం చేసే ప్రమాదం ఉంది.ఈ పరిణామంపై భారత అధికారులు స్పందిస్తూ, దేశ ప్రజల ఇంధన భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో లభ్యత, అందుబాటు ధర, ఇతర పరిస్థితులను బట్టే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. అయితే, ఈ కొత్త చట్టం వల్ల ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. దాదాపు 25 ఏళ్ల క్రితం 1998లో భారత్ నిర్వహించిన పోఖ్రాన్-×× అణు పరీక్షల అనంతరం అప్పటి అమెరికా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఆ తర్వాత జార్జ్ డబ్ల్యూ. బుష్ హయాంలో ఆ ఆంక్షలను ఎత్తివేశారు. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత అమెరికా నుంచి ఇలాంటి కఠినమైన వాణిజ్యపరమైన చర్యల ముప్పు పొంచి ఉండటం వ్యూహాత్మక, వాణిజ్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కొత్త చట్టం ఇరు దేశాల మధ్య నెలకొన్న బలమైన భాగస్వామ్యానికి కొత్త పరీక్షగా నిలవనుంది.

# 31 సినిమాలకు సెన్సార్ మినహాయింపు కట్.. కేంద్రంపై శశిథరూర్ ఫైర్

తిరువనంతపురంలో సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు ఈ ఫెస్టివల్ జరగనుంది. నిర్వాహకులైన కేరళ రాష్ట్ర చలనచిత్ర అకాడమీ మొత్తం 347 చిత్రాలను పరిశీలన కోసం పంపగా, కేంద్రం 31 చిత్రాలకు మినహాయింపును నిలిపివేసింది. వీటిలో రాజకీయ అసమ్మతి, కుల వివక్ష, గాజా సంక్షోభం, ఇరాన్ నిరసనలు వంటి అంశాల నేపథ్యంగా రూపొందించిన చిత్రాలు ఉన్నాయి. తిరస్కరించిన వాటిలో అట్టప్పాడి గిరిజనుల జీవితంపై తీసిన 'గ్లోబ్' అనే మలయాళ చిత్రం కూడా ఉండటం గమనార్హం. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం చలనచిత్ర ఉత్సవాల నిర్వహణ స్వేచ్ఛను హరించడమేనని కేరళ సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విష్ణునాథ్ విమర్శించారు. మరోవైపు, చలనచిత్ర అకాడమీ ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కేంద్రాన్ని అభ్యర్థించింది. ఇప్పటికే జ్యూరీ సభ్యులు, చిత్రనిర్మాతలు ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారని, స్క్రీనింగ్ ఫీజులు కూడా చెల్లించామని అకాడమీ స్పష్టం చేసింది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల ఫెస్టివల్ షెడ్యూల్ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

సెప్టెంబర్ | మంగళవారం | 22 | 2026




# గణనాథుడి సేవలో తిరుపతిరెడ్డి.





**భక్తులకు స్వయంగా అన్నం వడ్డించిన కంఠారెడ్డి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

గణేష్ ఉత్సవాల సందర్భంగా మెదక్ పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.గణనాథుడి దర్శనం కోసం ఏర్పాటు చేసిన మండపాలను కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు.పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ మాయ గంగామణి మల్లేశం ఇంటి వద్ద ప్రతిష్ఠించిన గణనాథుడిని తిరుపతిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.అనంతరం జీకేఆర్ గార్డెన్ వద్ద గల గణేష్ మండలి గణనాథుని, శాంతినగర్ లోని శాంతినగర్ లోని శివశక్తి గణేష్ మండలి, ఫతేనగర్ లోని దత్త సాయి గణేష్ మండలి మండపాలకు చేరుకుని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానంలోభక్తులతో కలిసి పాల్గొన్న తిరుపతిరెడ్డి. స్వయంగా భక్తులకు అన్నం వడ్డించడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగాలని ఆకాంక్షించారు.గణనాథుడి ఆశీస్సులతో మెదక్ ప్రజలందరూసుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన కోరుకున్నారు. అనంతరం గణేష్ మండలి సభ్యులు తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్,జుబర్ అహ్మద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి,మాజీ ఏడుపాయల చైర్మన్ బాలా గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, సర్పంచ్ అందే కొండల్ రెడ్డి, బిఆర్ఎస్వీ నాయకులు గంజి నవీన్,చంద్రమోహన్ గౌడ్, జగదీష్,కిరణ్ గౌడ్,నాగరాజు కిరణ్ గౌడ్,ప్రవీణ్ సాయి, రోహన్,మహేందర్ వివిధ మండపాల గణేష్ మండలి సభ్యులు,సున్నం సతీష్,గొల్ల శ్రీనివాస్,ఇప్పనారాయణ,లోకమయిన మనోహర్,వెంకగొని సాయి గౌడ్,రోహన్ గౌడ్,రిత్విక్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం.





**అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం.**

**పేదలకు సంక్షేమ పథకాలు నియోజకవర్గానికి భారీగా అభివృద్ధి నిధులు.**

**లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.**

**మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.సోమవారం మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు రేషన్ కార్డు ఎంతో కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత కల్పించే ముఖ్యమైన పత్రాల్లో ఇది ఒకటని అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో నిర్లక్ష్యం జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో అనేక మంది అర్హులైన పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించి స్మార్ట్ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామనిఅన్నారు.మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్లు,డ్రైనేజీ,తాగునీరు,విద్య,వైద్యం తదితర రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అభివృద్ధి.సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమంతో పాటు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు,మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి సమ్మక్క సారలమ్మ పేర్లు పెట్టాలి

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక విజ్ఞప్తి**

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,సెప్టెంబర్ 21(జనసంఘర్షణ):**


తెలంగాణ ఆదివాసీ చరిత్ర, ఆత్మగౌరవం, వీరత్వానికి ప్రతీకలైన వీరనారులు సమ్మక్క సారలమ్మ పేర్లను వరంగల్ విమానాశ్రయానికి పేరు పెట్టాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కాకతీయుల కాలంలో అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా సమ్మక్క సారలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమైనదని ఆయన పేర్కొన్నారు. వారి చరిత్ర కేవలం ఆదివాసీ సమాజానికి మాత్రమే పరిమితమైనది కాదని, తెలంగాణ ప్రజల పోరాట చరిత్రలోనూ ఒక ముఖ్యమైన అధ్యాయమని తెలిపారు.వరంగల్ ప్రాంతానికి సమ్మక్క సారలమ్మ చరిత్రతో ఉన్న సాంస్కృతిక, చారిత్రక అనుబంధాన్ని గుర్తిస్తూ విమానాశ్రయానికి "సమ్మక్క సారలమ్మ విమానాశ్రయం" అనే పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.విమానాశ్రయానికి వారి పేర్లు పెట్టడం ద్వారా తెలంగాణ ఆదివాసీ వీరనారుల చరిత్ర, త్యాగం, సంస్కృతి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసే అవకాశం ఉంటుందని అన్నారు.మా ప్రధాన డిమాండ్,ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరు ప్రసిద్ధి ఉన్న మేడారం జాతర కావున వరంగల్ విమానాశ్రయానికి వీరనారులు సమ్మక్క,సారలమ్మ పేర్లను అధికారికంగా పెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి.ఈ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదివాసీ



హక్కుల పరిరక్షణ వేదిక తరపున కోరుతున్నామని ఇరప రాజు దొర తెలిపారు.

## ప్రజలను అలరించిన చిరంజీవి సాన్వి షణ్ముఖి

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా, భద్రాచలం, సెప్టెంబర్ 21(జనసంఘర్షణ):**





భద్రాచలం లో వినాయక చవితి సందర్భంగా జరుగుతున్న ఉత్సవాలలో కుప్పాల నాగరాజు నిర్వహించుచున్న భద్రాద్రి కా మహారాజ్ ఘనంగా నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మణుగూరు ఎస్ టి ఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్,యూడీసీ క్రాంతి కుమార్, కుమార్తె చిరంజీవి సాన్వి షణ్ముఖి కూచిపూడి భరతనాట్యం ప్రజల మన్ననలను పొందింది .చిరంజీవి సాన్వి షణ్ముఖి ప్రదర్శించిన నాట్యం కు భద్రాచలం ప్రముఖ కాంట్రాక్టర్, పెద్దలు పాకాల పాటి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా మెమెంటో ను అందజేసి ఆశీర్వదించారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి.

**అదనపు కలెక్టర్ నగేష్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**



ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజలనుంచి ఆర్జీలను స్వీకరించారు.అందులో భూభారతి 36,పెన్షన్లు10, ఇందిరమ్మ ఇల్లు10,ఇతర 34 మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి పరిష్కారం చూపించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లపురం గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కి వినతి

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా, భద్రాచలం, సెప్టెంబర్ 21(జనసంఘర్షణ):**



భద్రాచలం సబ్ కలెక్టర్ ని చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.చర్ల మండలం రాళ్లపురం గ్రామం అటవీ ప్రాంతంలో ఉండడం వలన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లడానికి, పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది.కావున అటవీ శాఖ అధికారుల నుండి రోడ్డు నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని, అలాగే గ్రామానికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.దీనిపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అటవీ శాఖ అధికారులతో మాట్లాడి, త్వరితగతిన రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చేలా చూస్తామని, గ్రామ మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు:యువ నాయకులు పరిటాల సంతోష్ కుమార్, గ్రామస్తులు ముసికి ప్రవీణ్ ,ముసికి రాజయ్య ,కరాటం గంగయ్య ,ముసికి గంగోలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారుడికి రూ.28 వేల చెక్కు

**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం నియోజకవర్గం, సెప్టెంబర్ 21(జనసంఘర్షణ):**

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నామని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు.భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి,సీఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుమ్ముగూడెం మండలం ప్రగల్లపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి నాగరాజుకు రూ.28,000 వేల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబంతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్న ఎమ్మెల్యే , ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం వారికి కొంతైనా ఊరట కలిగిస్తుందని, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక భరోసాగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , పార్టీ నాయకులు రత్నం రమాకాంత్ , నర్రా రాము, ఎండి జిందా, చేగోండి శ్రీనివాస్, సుజాత, కంప్యూటర్ ఆపరేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



## నిబద్ధతకు ప్రతీకగా ఐపీఎస్ అధికారి డీ. రూపా మౌద్గిల్

**20 ఏళ్లకు పైగా ఐపీఎస్ సర్వీసు.. విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు**

**బెంగళూరు/సెప్టెంబర్ 21/(జన సంఘర్షణ)**




బెంగళూరు: సివిల్ సర్వెంట్లు నిజాయితీగా, నిబద్ధతతో తమ విధులను నిర్వర్తిస్తే సమాజంలో ఎలాంటి మార్పు తీసుకురాగలరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజల కోసం పనిచేస్తూ, ఎలాంటి ఒత్తిళ్లకూ వెనుకాడకుండా విధి నిర్వహణలో ముందుండే అధికారులు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తారు. అలాంటి అధికారుల్లో కర్ణాటకకు చెందిన ఐపీఎస్ అధికారి డీ. రూపా మౌద్గిల్ ఒకరు. రెండు దశాబ్దాలకు పైగా ఐపీఎస్ సర్వీసులో కొనసాగుతున్న ఆమె.. విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీకి ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజా సేవలో భాగంగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, విధి పట్ల అంకితభావంతో పనిచేయడం ద్వారా ఆమె పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యలపై స్పందిస్తూ, తన విధులను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొంటారు. కొత్తగా విధుల్లో చేరిన అధికారుల మాదిరిగానే ఉత్సాహంతో బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న డీ. రూపా మౌద్గిల్ సేవా ప్రస్థానం సివిల్ సర్వెంట్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## అఖిల భారత రైతు కూలీ సంఘం 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

**సెప్టెంబర్ 29,29,30 తేదీ ల్లో ఖమ్మం లో**

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 21(జనసంఘర్షణ):**



కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయకరంగాన్ని దివాలా తీపించి మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయకరంగాన్ని బహుళ జాతి కంపెనీలకు అంబానీ ఆదానీలకు కట్టబెడుతుంది. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, యూరియా యాప్ ను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రజా పోరాటంలో భాగస్వాములు కావాలని, ఏ ఐ కే ఏం ఎస్,అఖిల భారత రైతు కూలి సంఘం డివిజన్ నాయకులు మట్ట నరసింహారావు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈరోజు చర్ల మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ రైతులతో మహిళలతో జరపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా రైతుల కు గిట్టుబాటు ధర కల్పించాలని, మొక్కజొన్న కింటాకు 3000, పత్తి 15000 ఇవ్వాలని కోరుతూ అందులో భాగంగానే ఖమ్మంలో జరుగు అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభలకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి రావాలని ఆయన కోరారు .ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకులు కుంజ జోగారావు, సంతపూరి సురేష్, గొంది మూయన్న, కొండ స్వామి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ, తెలంగాణలో దసరా సెలవులు ఇవే..

**హైదరాబాద్ / సెంబర్ 21 ( జన సంఘర్షణ )**



తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దసరాతో పాటు బతుకమ్మ కూడా వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది. ఇక ఏపీ విషయానికొస్తే.. 10 రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవులు వచ్చాయి. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 12 నుంచి దసరా పండుగ సెలవులు మొదలవుతాయి. అక్టోబర్ 21 వరకు మొత్తం 10 రోజుల పాటు సెలవులు కొనసాగుతాయి. ఏపీ, తెలంగాణలో సెలవులు భిన్నంగా ఉన్నాయి. అయితే క్రైస్తవ, మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించి సెలవులు భిన్నంగా ఉంటాయి.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమం.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో గణనాథునికి ప్రత్యేక పూజలు.**

**రూ.29 వేలతో గణపతి లడ్డూను సొంతం చేసుకున్న హెడ్ కానిస్టేబుల్ శంకర్.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని, ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టే ప్రతి కార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా ఆశీర్వదించాలని మహాగణపతిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం గణపతి లడ్డూ వేలంపాట నిర్వహించగా హెడ్ కానిస్టేబుల్ శంకర్ రూ. 29,000లకు లడ్డూను సొంతం చేసుకున్నారు.గత ఏడు రోజులుగా విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ శోభాయాత్రను ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలేందర్, పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## అప్పాయిగూడెం రైతు వేదిక :-- మహిళల అక్రమ రవాణా, సైబర్ - చట్టాల పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం.

**మహిళలు పిల్లల అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్వాడీ టీచర్స్ కీలక పాత్ర పోశించాలి**

**సీడీపీఓ - ఉమ**

**ప్రజ్వల జిల్లా సమన్వయ కర్త - సురేస్ కుమార్**

**అప్పాయిగూడెం సర్పంచ్ - దండు ప్రవీణ్**

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిషు సంక్షేమ శాఖ కామేపల్లి, ఖమ్మం ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ కి కి మానవ అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, అక్రమ రవాణా చట్టాలపై ఒక రోజు శిక్షణ శిక్షణ కార్యక్రమం ను ఉద్దేశించి జణూూ ఉమ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే మూడవ అతి పెద్ద నేరంగా ఉంది. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయి లు మహిళలు ఈ అక్రమ రవాణాకు గురి అవుతున్నారు. ముక్యంగా యువత సెల్ ఫోన్ మోజులో పడి పేస్ బుక్, ఇంస్టాగ్రామ్, స్నాప్ చాట్, మెసెంజర్ లాంటి సోషల్ మీడియా లో పోస్ట్ చేసినప్పుడు, సైబర్ ట్రాఫికర్స్ ఫోటోలను డౌన్లోడ్ చేసి, మార్ఫింగ్ చేసి, అమ్మాయిలను మహిళలను బ్లాక్ మెయిల్ చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు కాబట్టి అవగహన పెంచుకున్న అంగన్వాడీ టీచర్స్ మదర్స్ మీటింగ్ లలో చెప్పాలి మరియు ఏదైనా సమస్యలు వస్తే 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలి అని అన్నారు. చట్టాలను అనుసరించేటప్పుడు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు జరిగిన, అమ్మాయిలు మహిళలపై ఎలాంటి క్రైమ్ జరిగిన సంబంధిత అధికారులకు రిపోర్ట్ చేయాలి. ఈ శిక్షణ అనంతరం గ్రామ కమిటీలలో ఈ విషయాలపై అవగాహనా కల్పించాలి అని సూచించారు. సురేష్ కుమార్ జిల్లా కోఆర్డినేటర్ ప్రజ్వల : ఆడపిల్లల మహిళల రక్షణ కొరకు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ స్థాపించబడింది. పద్మశ్రీ డాక్టర్. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 35000 మంది అమ్మాయిలను చిన్న పిల్లలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగింది . మహిళా శిషు సంక్షేమ సంస్థ ఖమ్మం ద్వారా మండల స్థాయిలో అంగన్వాడీ టీచర్స్ కి అక్రమ రవాణా, సైబర్ ఆధారిత అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తూ సంబంధిత చట్టాలు దీఛీూ - భారతీయ న్యాయ సంహిత చట్టం - 2023. ITPA - అనైతిక అక్రమ రవాణా నిరోధక చట్టం - 1956. POCSO - బాలబాలికల లైంగిక నేరాల సంరక్షణ చట్టం - 2012. బాల్య వివాహల నిషేధ చట్టం - 2006. జీజీూ - బాలల న్యాయ చట్టం - 2015.ల గురించి వివరిస్తూ ముఖ్యమైన సెక్షన్స్ ను నోట్ చేయడం జరిగింది. సమస్యలు ఎదురైనప్పుడు



ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్న టోల్ ఫ్రీ నంబర్స్ ను సంప్రదించాలి 112 - ఇంటిగ్రెటెడ్ టోల్ ఫ్రీ నెంబర్ (పోలీస్, చైల్డ్ లైన్, ఏదయినా క్రైమ్) 1930 - సైబర్ క్రైమ్, 181 - మహిళా హెల్ప్ లైన్. 1908 డ్రగ్స్ అండ్ నార్కోటిక్స్.మరియు మహిళలు, పిల్లలు, సమాజం ఏదైనా సమస్య ను ఎదురుకున్నప్పుడు సంబంధిత టోల్ ఫ్రీ నంబర్స్ ను సంప్రదించాల హెల్ప్ లైన్ ల గురించి వివరిస్తూ అవి ఎలా పని చేస్తాయో వివరించడం జరిగింది శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్స్ తో సమాజ జాగృతి సంఘము ను ఏర్పాటు చేసి, సమస్య లను రిపోర్ట్ చేయాలనీ సూచించారు ఈ కార్యక్రమం లో ప్రజ్వల కోఆర్డినేటర్ లు భూపాల్, నాగరాణి ICDS సూపర్ వైసర్ లు, సత్య షీలా, దేవేంద్ర , కృష్ణ కుమారి మరియు సింగరేణి మండల అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు

## రుద్రూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం





**కుల సంఘాల ద్వారా అర్హుల గుర్తింపునకు నిర్ణయం.. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు**

**రుద్రూర్, సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ):**

కామారెడ్డి జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సోమవారం నిర్వహించిన గ్రామసభ గందరగోళానికి దారితీసింది. గ్రామ సర్పంచ్ సునీత అధ్యక్షతన, తహసీల్దార్ తారాబాయి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో లబ్ధిదారుల ఎంపిక విధానంపై గ్రామస్తులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. రుద్రూర్‌లో గత ప్రభుత్వ హయాంలో 150 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టగా, అవి పూర్తిస్థాయి మౌలిక వసతులు లేకుండానే ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. మురుగు కాలువలు, సిమెంట్ రహదారులు, తలుపులు, కిటికీలు, మంచినీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉందని వారు తెలిపారు. ఈ 150 ఇళ్లకు 483 దరఖాస్తులు రావడంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ తారాబాయి గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను ప్రకటించేందుకు సిద్ధమవుతుండగా, కొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఇల్లు లేని కుటుంబాలను గుర్తించి, వారికి ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీంతో గ్రామసభలో కొంతసేపు వాగ్వాదం, గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ఒకవైపు లబ్ధిదారుల పేర్లను ప్రకటించాలని కొందరు కోరగా, మరోవైపు ముందుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి, అనంతరం అర్హులకు కేటాయించాలని మరికొందరు డిమాండ్ చేశారు.

కుల సంఘాలకు అర్హుల గుర్తింపు బాధ్యత

చర్చల అనంతరం గ్రామ సర్పంచ్ సునీత, తహసీల్దార్ తారాబాయి, ఉప తహసీల్దార్ సుందర్ నాయక్, ఉప సర్పంచ్ నర్సర్ కలిసి కుల సంఘాల ద్వారా అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో గుర్తించాలని నిర్ణయించారు. కుల సంఘాలు తమ పరిధిలో ఇల్లు లేని అర్హుల వివరాలను సేకరించి తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. అందిన పేర్లను అధికారులు పరిశీలించిన అనంతరం గ్రామసభ నిర్వహించి, లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయిస్తామని అధికారులు తెలిపారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా నిజమైన అర్హులనే గుర్తించాలని తహసీల్దార్ తారాబాయి కుల సంఘాల ప్రతినిధులకు సూచించారు.

గత పాలన నుంచి కొనసాగుతున్న సమస్యపై చర్చ

రుద్రూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితిపై గ్రామస్తుల మధ్య జరిగిన చర్చలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన నిర్మాణాలు పూర్తికాకపోవడం ఒక సమస్యగా ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో, అదే ఇళ్ల పంపిణీ ప్రక్రియలో లబ్ధిదారుల ఎంపికపై గందరగోళం నెలకొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు అంశాలపై స్థానికంగా రాజకీయ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారికంగా లబ్ధిదారుల ఎంపికకు ముందు అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం లాటరీ ద్వారా ఎంపిక చేసే విధానం పారదర్శకత కోసం ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో డబుల్ బెడ్‌రూం పథకంలో గ్రామసభ ద్వారా ప్రాథమిక పరిశీలన, అనంతరం అర్హతల సమగ్ర ధృవీకరణకు తహసీల్దార్ స్థాయిలో ప్రక్రియ ఉండేలా మార్గదర్శకాలు ఉన్నాయి. కుల సంఘాలు త్వరగా అర్హుల వివరాలను అందజేస్తే, తదుపరి ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసి ఇళ్ల కేటాయింపును చేపడతామని అధికారులు వెల్లడించారు. దీంతో గ్రామసభ చివరకు ప్రశాంతంగా ముగిసింది.

## 3వ వార్డులో సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులకు శ్రీకారం.

**రామాయంపేట మున్సిపాలిటీ 3వ వార్డులో సీసీ రోడ్డు,డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21(జన సంఘర్షణ)**


ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఈ సమస్యను మన శాసనసభ్యులు టైగర్ మైనంపల్లి రోహిత్ రావు గారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి, నేడు పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గూగులోత్ రవి నాయక్,దాకి శ్యామల స్వామి, కో ఆప్షన్ మెంబెర్స్ డెమో యాదగిరి, చింతల రాధా భవాని యాదగిరి,పట్టణ అధ్యక్షుడు చింతల సప్న స్వామి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అశోక్,సుంకోజి దామోదర్,దండు శివ,అబ్బాస్ నాగేందర్ పార్టీ నాయకులు కాలనీ నాయకులు పెద్దలు,పాల్గొనడం జరిగింది.



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# పాత పోతంగల్ విద్యార్థి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం





**11 రోజుల పాటు తెలుగు, మరాఠీ భజనలతో భక్తిమయ వాతావరణం.. ప్రముఖులకు శాలువాలతో సన్మానం**

**పాత పోతంగల్, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**

పాత పోతంగల్ గ్రామంలోని విద్యార్థి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.విద్యార్థి గణేష్ మండలి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు తెలుగు, మరాఠీ భజనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను కొనసాగించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీసు అధికారులు, జెడ్పీహెచ్ఎస్, ఎంఈఓ సాయి సార్, పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పల శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి గణేష్ మండలి సభ్యులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, ధనరాజ్, సూదం వెంకట్ సార్, గంటల సుదర్శన్, సూధం పరుశురాం, గంధపు గంగాధర్, దత్తు, వార్డ్ నెంబర్ ఫుల్ కంటి సాయిలు , సచిన్ బండారి, సాగర్, బొంబాయి నగేష్, తదితరులు పాల్గొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గణేష్ మండలి సభ్యులు, గ్రామస్తులు కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది కూడా పాత పోతంగల్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 11 రోజుల పాటు నిర్వహించిన తెలుగు, మరాఠీ భజనలతో పాటు అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన గ్రామస్తులు, భక్తులు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు గణేష్ మండలి సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# 24 గంటల్లో తల్లి, ముగ్గురు పిల్లల ఆచూకీ

**కుటుంబ కలహాల నేపథ్యంలో అదృశ్యం.. సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన కోటగిరి పోలీసులు**

**కోటగిరి, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**

కుటుంబ కలహాల నేపథ్యంలో ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన తల్లిని కోటగిరి పోలీసులు 24 గంటల్లో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల వేగవంతమైన చర్యలతో తల్లి బి. సాయిలతతో పాటు ఆమె ముగ్గురు పిల్లలు చైతన్య, చైత్ర, చైతు సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరుకున్నారు.కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామానికి చెందిన బి. సాయిలత శుక్రవారం తన భర్త ప్రశాంత్‌తో కుటుంబ కలహాల నేపథ్యంలో గొడవ పడిన అనంతరం, ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆమె ఎత్తొండ క్యాంప్‌లోని పుట్టింటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.ఈ విషయంపై సాయిలత తండ్రి లక్ష్మణ్ కోటగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోటగిరి పోలీస్ కానిస్టేబుల్ ఆలీ, డబ్ల్యూపీసీ అనురాధ ప్రత్యేకంగా గాలింపు చేపట్టారు. పోలీసుల ప్రయత్నాలతో ఏడపల్లి ప్రాంతంలో సాయిలతతో పాటు ముగ్గురు పిల్లల ఆచూకీని 24 గంటల్లో గుర్తించారు.అనంతరం సాయిలత, ముగ్గురు పిల్లలను కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ వద్దకు తీసుకువచ్చారు. ఎస్సై కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, సాయిలతతో పాటు ముగ్గురు పిల్లలను వారి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.పోలీస్ సిబ్బందికి ఎస్సై అభినందనలు తల్లి, ముగ్గురు పిల్లలను సకాలంలో గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంలో చొరవ చూపిన కానిస్టేబుల్ ఆలీ, డబ్ల్యూపీసీ అనురాధతో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ అభినందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పోలీసుల వేగవంతమైన స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటల్లో ఆచూకీ గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీస్ సిబ్బందికి ప్రజలు కూడా కృతజ్ఞతలు తెలిపారు.ఎలాంటి అనుకోని సంఘటన జరిగినా ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి అవసరమైన చర్యలు చేపడతారని తెలిపారు.




# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి.

**ఫిర్యాదుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలి.**

**జాప్యం లేకుండా సమస్యలు పరిష్కరించాలి.**

**ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంకర్షణ)**

ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు,ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, విచారణలోని పురోగతిని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.



## పోస్ట్‌మార్టం కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఫిర్యాదు

**బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘటనలపై ఆర్డీవోకు తెలుగు యువత నాయకుడి ఫిర్యాదు**

**బోధన్, సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ):**

బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు కొంతమంది సిబ్బంది మృతుల కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ నిజామాబాద్ పార్లమెంట్ తెలుగు యువత బోధన్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎత్తుండ రాజేందర్ బోధన్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ అంశంపై పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ, ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న వారి వద్ద పోస్ట్‌మార్టం కోసం డబ్బులు అడగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు వాస్తవమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని రాజేందర్ కోరారు. డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు చూపించే స్క్రీన్‌షాట్ జిరాక్స్ కాపీని ఫిర్యాదుకు జత చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అవగాహన కల్పించాలని వినతిభవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో "పోస్ట్‌మార్టం కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయండి" అనే సమాచారాన్ని ప్రజలకు కనిపించేలా ఫ్లెక్సీలు, గోడ రాతలు లేదా నోటీసుల రూపంలో ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా ఫిర్యాదు చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.




## పోలీస్ కమిషనర్ కార్యాలయం నిజామాబాద్

**గణేష్ నిమజ్జనం నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని వైన్స్ షాపులు బంద్ : పోలీస్ కమిషనర్ వెల్లడి**

**నిజామాబాద్: సెప్టెంబర్ 21( జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల ప్రజలందరికీ తెలియజేయునది సెక్షన్ 20(1) తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారంగా ఏమనగా గణేష్ నిమజ్జనం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలో గల కళ్ళు దుకాణాలు , కల్లు డిపోలు , ఐ.ఎమ్.ఎల్ షాప్స్ / 2-బి బార్స్ / క్లబ్బులు / టిడి-1 మరియు టి.యస్.బి.సి.ఎల్ మొదలగునవి తేదీ: 22-9-2026 ఉదయం 6 గంటల నుండి తేది : 23-9-2026 ఉదయం 6 గంటల వరకు మూసి వేయబడును. పోలీస్ పి. ఆర్. ఓ పోలీస్ కార్యాలయం నిజామాబాద్




## మార్కండేయ ఆలయంలో రుద్రాభిషేకం.

**మహిళల కుంకుమార్చన.**

**అన్న ప్రసాద వితరణ.**

**నవరాత్రోత్సవాల్లో భక్తుల సందడి.**


**హాజరైన నాయకులు, అధికారులను.**

**సత్కరించిన పద్మశాలి సంఘం.**

**రామాయంపేట.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

రామాయంపేట పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం మహిళల కుంకుమార్చన నిర్వహించారు. రుద్రాభిషేకంతో ప్రారంభమైన నవరాత్రోత్సవ వేడుకలు అన్నప్రసాద వితరణతో ముగిశాయి.పద్మశాలి సంఘం నిర్వహణలో సాగిన వేడుకల్లో భక్తుల సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు,పుట్టి సందీప్,దేవుని రంజిత్,దేమే యాదగిరి లతోపాటు కాంగ్రెస్ నాయకులు చింతల యాదగిరి, డాకి స్వామి,బి.ఆర్.ఎస్ నాయకులు చౌదరి సుప్రభాత్ రావు, పద్మశాలి జిల్లా అధ్యక్షులు మ్యాకల జయరాములు,టి. యు.డబ్ల్యూ.జే జిల్లా సంయుక్త కార్యదర్శి మర్కు నగేష్, రామయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దెల సత్యం,కట్ట ప్రభాకర్, రామారావు యాదగిరి లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి అధ్యక్షులు మద్దెల రమేష్ శాలువాలతో సత్కరించారు.



## తెలంగాణలో 13 రోజుల పాటు విద్యాసంస్థలకు దసరా సెలవులు

**అక్టోబర్ 10 నుంచి 22 వరకు సెలవులు.. 23న పాఠశాలలు పునఃప్రారంభం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ):**

రాష్ట్రంలోని విద్యార్థులకు దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రభుత్వం 13 రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు విద్యాసంస్థలకు దసరా సెలవులు కొనసాగనున్నాయి.అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ సెలవులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు వర్తించనున్నాయి.సెలవులకు ముందు అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు. దసరా, బతుకమ్మ పండుగలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు వరుసగా 13 రోజుల పాటు సెలవులు ప్రకటించారు.




## ప్రజావాణిలో వెలువెత్తిన వినతులు 13 దరఖాస్తుల స్వీకరణ.

**రామాయంపేట ఎంపీడీవో షాజీలుద్దీన్ తెలిపారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధిసెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ప్రజావాణిలో మొత్తం 13 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని ఎంపీడీవో శాజీలోద్దీన్ తెలిపారు.అందులో రెవెన్యూ 4 మున్సిపల్ 3 విద్యుత్ శాఖ 2 ఎస్సీ కార్పొరేషన్ 1 ఇందిరమ్మ ఇండ్లు 1 పోలీస్ శాఖ 1 పంచాయతీరాజ్ శాఖ 1 సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.వీటిని పరిశీలించి ప్రజా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వెల్లడించారు.



జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

## విశ్వకర్మ ఏక్తాయాత్ర పాదయాత్రకు విశ్వబ్రాహ్మణుల సంఘీభావం.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**



విశ్వకర్మల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన విశ్వకర్మ ఏక్తాయాత్ర పాదయాత్ర రామాయంపేటకు చేరుకుంది.రామాయంపేటకు చేరుకున్న పాదయాత్రకు స్థానిక స్వర్ణకారులు విశ్వకర్మలు స్వాగతం పలికి వారికి తమ సంఘీభావాన్ని తెలిపారు.ఈ సందర్భంగా విశ్వకర్మ ప్రతినిధులు పుష్పగిరి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విశ్వకర్మలు ఎదుర్కొంటున్న 21 డిమాండ్ల సమస్యలు సామాజిక భద్రత విశ్వకర్మలకు కమిషన్ ఏర్పాటు చేయాలని తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని ప్రభుత్వాలను కోరారు.సెప్టెంబర్ 17న హైదరాబాద్ నుండి ప్రారంభమైన ఏక్తాయాత్ర నవంబర్ 29న ఢిల్లీలో భారీ సభతో ముగుస్తుందని తెలిపారు.ఈ సభకు విశ్వబ్రాహ్మణులు స్వర్ణకారులు మేధావులు పారిశ్రామికవేత్తలు కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట స్వర్ణకార సంఘం నాయకులు విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## భర్తను హత్య చేసిన భార్యకు జీవిత ఖైదు.

**పకడ్బందీ దర్యాప్తు.బలమైన సాక్ష్యాధారాలతో నిందితురాలికి శిక్ష.**

**శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**




మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నిందితురాలికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వివరాలు వెల్లడిస్తూ పార్కిబండ గ్రామానికి చెందిన మురళికి, మనోహరాబాద్‌కు చెందిన విజయలక్ష్మితో సుమారు 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ విషయాలపై తరచూ వివాదాలు జరుగుతుండటంతో మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో కూడా పంచాయతీలు నిర్వహించి ఇరువురికి నచ్చజెప్పారు. మురళికి సుమారు 18 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు.ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో 15.03.2021 రాత్రి మురళి మంచంపై నిద్రిస్తున్న సమయంలో విజయలక్ష్మి రోకలిబండతో అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 16.03.2021న అప్పటి మనోహరాబాద్ ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ స్వామిగౌడ్ పూర్తి స్థాయిలో సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్, ప్రస్తుత మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ సాక్షులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి కేసు విచారణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు. పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితురాలికి జీవిత ఖైదుతో పాటు రూ.6,000 జరిమానా విధించారు. కేసు విచారణలో కోర్టు లైజన్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు. నిందితురాలికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, పటిష్ఠమైన సాక్ష్యాధారాలనున్యాయస్థానంలో సమర్పించిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## గణేష్ నిమజ్జన శాంతి భద్రతలను దృశ్యంలో మద్యం షాపులు బంద్

**రుద్రూర్: సెప్టెంబర్ 21(జన సంఘర్షణ)**




నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం రుద్రూర్ సబ్ ఇన్స్పెక్టర్ గణేష్ పండగల గురించి సూచించారు రుద్రూర్ మండలంలోని గణేష్ ఉత్సవ నిర్వాహకులకు పోలీసు వారి సూచన (ఈనెల. 22. 23. 24. తేదీల్లో) జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా జరిగే శోభాయాత్రలో డిజె సాంగ్స్ వినియోగించడం నిషేధం. కావున నిబంధనలు ఉల్లంఘించి డిజె సౌండ్స్ వినియోగిస్తే సంబంధిత ఉత్సవ నిర్వాహకులతో పాటు డీజే యజమానుల పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు

రుద్రూర్ పోలీస్.

## దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి -- గొంగిడి సునిత మహేందర్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా/సెప్టెంబర్ 21(జన సంఘర్షణ)**




సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మహాధర్నాలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని దివ్యాంగులకు మద్దతు తెలిపారు.అనంతరం దివ్యాంగులతో కలిసి అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన పద్మ దేవేందర్‌రెడ్డి.





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

మెదక్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ మాయ గంగమని మల్లేశం, మరియు మాయ శ్రీనివాస్ నివాసంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.అనంతరం మాయ గంగమని మల్లేశం, పద్మ దేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,కౌన్సిలర్లు దీపక్‌కుమార్,జుబేర్ అహ్మద్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న శంకరంపేటలో స్మార్ట్ రేషన్ కార్డులు,కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.





**మెదక్ ఎమ్మెల్యే మెదక్ డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా అందజేత.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంకర్షణ)**

మెదక్ నియోజకవర్గంలోని చిన్న శంకరంపేట మండలంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులు,ప్రజాప్రతినిధులు, అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే ప్రయోజనాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రేషన్ కార్డు ప్రతి కుటుంబానికి ఆహార భద్రతతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడే ముఖ్యమైన పత్రంగా ఆయన వివరించారు.అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద కుటుంబాలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు,అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోంది. నియోజకవర్గంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తాం.పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు.పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలే ఆర్థిక భరోసా ఎమ్మెల్యే రోహిత్ రావు చిన్న శంకరంపేట మండలంలో జరిగిన కార్యక్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందించడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత.చిన్న శంకరంపేట మండల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాను అని తెలిపారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన కుటుంబాలకు కూడా ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ శోభయాత్ర కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు : పోలీస్ కమిషనర్ వెల్లడి

**నిజామాబాద్ సిటీ. సెప్టెంబర్ 21 ( జన సంఘర్షణ )**

శోభయాత్రలో 1300 మంది సిబ్బందితో భారీ ఏర్పాట్లు

శోభయాత్ర దారి పొడవున పటిష్టమైన నిఘా వ్యవస్థ,

డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ, 200 సి.సి కెమెరాలతో ఏర్పాట్లు

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, డివిజన్ లలోని అన్ని గణేష్ నిమజ్జనోత్సం శోభయాత్ర సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య,. తెలియజేయడం జరిగింది. గణేష్ నిమజ్జనోత్సవ శోభయాత్ర శాంతియుతంగా సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అన్ని డివిజన్ పరిధిలలో ప్రధాన నిమజ్జన మార్గాల్లో దాదాపు 1300 మందికి పైగా పోలీస్ సిబ్బందిని నియమించామని, సి.సి కెమెరాల ద్వారా నిఘా డ్రోన్ కెమెరాలలతోపర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాట్లు పోలీస్ సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ, ఫారెస్టు శాఖ, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ మొదలగు వారితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

శోభయాత్రలో తప్పనిసరి పాటించవలసిన సూచనలు

1) నిమజ్జన ఊరేగింపులో శాంతియుతంగా పాల్గొనాలని

2) అనుమానస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వలని

3) ట్రాఫిక్ నియమాలు అందరూ పాటించాలని

4) ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలని

5) డి.జేలు పూర్తిగా నిషేదం

6) ఎటువంటి “ రూమర్స్ “ ( పుకార్ల) ను నమ్మరాదు.

7) మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనడం తప్పు వారిపై కఠిన చర్యలు తీసుకోబడును.

అత్యవసర సమయంలో సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

1) 112 డయల్

2) పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126-59700

3) సంబంధిత పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించగలరు.

ప్రజలందరూ ఈ గణేష్ శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్., తెలియజేశారు.



# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక




# కోటగిరి ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం





**మొదటి విడతలో 26 ఇళ్లు మంజూరు.. 23 ఇళ్ల నిర్మాణం పూర్తి దశలో: ఎంపీడీవో విష్ణు**

**కోటగిరి, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొందాపూర్ సంగీత--కొందాపూర్ పోశెట్టి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో సోమవారం ప్రారంభించారు. కోటగిరి ఎంపీడీవో విష్ణు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ కలిసి రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం నూతన గృహంలో పార్వతీ పరమేశ్వరులు, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు కొందాపూర్ సంగీత, కొందాపూర్ పోశెట్టి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కోటగిరి ఎస్సీ కాలనీకి మొదటి విడతలో 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 23 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో మూడు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. కోటగిరి మండలానికి మొదటి విడతలో మొత్తం 406 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 126 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని వివరించారు.

రెండో విడతలో 200కు పైగా ఇళ్లకు సన్నాహాలు

కోటగిరి మండలానికి రెండో విడతలో 200కు పైగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో విష్ణు తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, దరఖాస్తు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

పేదలందరికీ ఇళ్లు వచ్చేలా కృషి: సర్పంచ్ బర్ల మధుకర్

ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు స్థానిక సర్పంచ్, యువ నాయకుడు బర్ల మధుకర్ మాట్లాడుతూ.. కోటగిరి గ్రామంలో పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పాటు అగ్రో చైర్మన్ కాసుల బాలరాజు సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ముఖ్యంగా ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా సహకారం అందిస్తూ, ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇల్లు ఉండేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.కోటగిరి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మొదటి విడత పనులతో పాటు రెండో విడతకు సంబంధించి కూడా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నిధులు!

బర్ల మధుకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లుల కోసం లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో విడతల వారీగా నిధులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుండటం సంతోషకరమని అన్నారు.గుడిసెలు, రేకుల ఇళ్లు, పెంకుటిళ్లు లేకుండా ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనులు ఎక్కడైనా నిలిచిపోయి ఉంటే లబ్ధిదారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయిస్తామని చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్నవారుఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, మిషన్ భగీరథ ఏఈ ధనరాజ్, జీపీ సెక్రటరీ సందీప్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొందాపూర్ పోశెట్టి, వార్డు సభ్యుడు కన్నం శ్రీనివాస్, గ్రామ సీనియర్ నాయకులు మోతిపేట రాజయ్య, పాకాల సాయిలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పేగుల లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

---

# సర్--2026పై రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించాలి.







**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**


**ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.**

**అక్టోబర్ 25లోపు అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి.**

**జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**

ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.సోమవారం, హైదరాబాదు నుంచి ఎస్ఐఆర్--2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిలి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చివరి నిమిషం వరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ముందుగానే పరిష్కరించాలని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు.ఎస్ఐఆర్--2026కు సంబంధించిన అన్ని పనులను అక్టోబర్ 25లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు.ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్, సంబంధిత పత్రాలను సమర్పించేలా అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని



సూచించారు.ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో బీఎల్ఏలు ఇళ్లను గుర్తించడంలో సహకరించవచ్చని తెలిపారు. బీఎల్ఏ ద్వారా నోటీసులు పంపిణీ చేసినట్లు గుర్తిస్తే సంబంధిత బీఎల్ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వయోవృద్ధులు, దివ్యాంగులు,విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై, సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీఓ రమాదేవి ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫర్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ నిర్వహణ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్.

- **ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,మెదక్ జిల్లా శాఖ నిర్వహణ కమిటీకి ఎన్నికలు.**
- **04న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి,మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.**
- **అదే విధంగా తుది సభ్యుల జాబితాను కూడా ప్రచురించడం జరిగిందన్నారు.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 21 (జన సంఘర్షణ)**




మెదక్ జిల్లా శాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరికీ ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివరాలను వెల్లడించారు.

ఎన్నికల కార్యక్రమం.

24-09-2026: ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహణ కమిటీ సభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ.

స్థలం,రెవెన్యూ డివిజనల్ కార్యాలయం,మెదక్ డివిజన్ జిల్లా.25 ఉదయం 10.00 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన,చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రచురణ.

స్థలం: రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, డివిజన్ మెదక్ జిల్లా వద్ద జరుగును.

26 ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ,తుది నామినేషన్ల జాబితా ప్రచురణ, గుర్తుల కేటాయింపు.

స్థలం: రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, మెదక్ డివిజన్ ఉ మెదక్ జిల్లా.04-10-2026: అవసరమైన పక్షంలో ఎన్నికలు నిర్వహించబడతాయి.


ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ కేంద్రం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, మెదక్ డివిజన్ మెదక్ జిల్లా అదే రోజు సాయంత్రం 4.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. ఫలితాల ప్రకటన అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నికలు నిర్వహిస్తారు.నామినేషన్ ఫీజుగా రూ.10,000/- (పది వేల రూపాయలు) తిరిగి చెల్లించబడని రుసుము చెల్లించాల్సి ఉంటుంది. నామినేషన్ ఫారాలను ఎన్నికల అధికారిని వ్యక్తిగతంగా సంప్రదించడం ద్వారా (లేదా) ఆయనకు రాతపూర్వకంగా అభ్యర్థన సమర్పించి అధీకృత వ్యక్తి ద్వారా 24-09-2026న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పొందవచ్చని తెలిపారు.మరిన్ని వివరాల కోసం ఎన్నికల అధికారి ఫోన్ నంబర్ 9346999 257ను సంప్రదించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో గుర్తింపు కోసం సొసైటీ జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డుతో పాటు ఫోటో గుర్తింపునకు సంబంధించిన ఆధారాన్ని సభ్యులు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కోరారు.

## పోతంగల్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**సర్వే నంబర్ 170తో పాటు ప్రభుత్వ భూముల సరిహద్దులు, రికార్డులను పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి**

**పోతంగల్, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**



శ్రీయుత గౌరవనియులైన కలేక్టర్ గార్కి నిజామాబాద్ జిల్లా తెలంగాణ

విషయం;

పోతంగల్ గ్రామంలో రేవన్యు భూమి పట్ట నెం 170/ అ,ఆ, ఇ,ఈ,ఉ,ఊ అనే సర్వే నంబర్ సుమారు 12 ఎకారల సర్వేనంబర్ మొత్తం ఇ సర్వే నంబర్ యొక్క బోంద్రిస్ విత్ రేవన్యు నకశ మరియు టిపన్ రేవన్యు నకశ మ్యాప్ లో పోతంగల్ గ్రామంలో రేవన్యు శేతువారి మరియు రికర్డ్ ప్రకారం 1953,1954,1955, సర్వే నంబర్ 170 ఇది పట్ట నేంబర్ దిన్ని రికర్డ్స్ రేవన్యు కార్యలయము , జిల్లా కలేక్టర్ కార్యలయము మరియు ల్యాండ్ రేవన్యు కార్యలయము అందుబాటులో ఉన్నవి. ఇట్టి 170 సర్వే నంబర్ బోంన్‌దరిస్ చుటున్న ఒక్క గోలుసు రోడ్డు సూమారు 33 పీట్లు రోడ్డు బోంన్‌దరి వేయ్యడం జరిగింది 2006 – 2007 లో వేయ్యడం జరిగింది ఇందులో మొరం ఫార్‌మిషన్ రోడ్డు వన్ సైడ్ సిసి రోడ్డు డ్రెన్ వన్ సైడ్ మొరం ఫార్‌మిషన్ రోడు మరియు కాల్‌వట్టు వేయ్యడం జరిగినది ప్రభుత్వ పరంగా ఇట్టి వేసిన్న రోడ్డు యంబి రికర్డ్ పంచాయతి రాజ్ యక్ట్ ప్రకారం మరియు మండల యంబి రికర్డ్ యాక్ట్ ప్రకారం మరియు కాన్‌స్టిన్ని డోలప్‌మేంట్ నిదుల యాక్ట్ ప్రకారం ఇవ్వి అన్ని పనులు ప్రభుత్వ పరంగా పట్ట రేవన్యు సర్వే నంబర్ 170 చుట్టు ఇ పనులు ఆన్‌రికార్డు ప్రభుత్వ పరంగా చేయడమైనది దయచేసి ఇట్టి బోంన్‌డ్రిస్ మరియు బోంన్‌డ్రి పక్క నుండి రోడ్డు ఎద్దైతే వేయ్యడం జరిగిందొ అవి అన్ని అక్రమలు తోలిగించలన్ని మనవి చేయుచున్నము.

ఎద్దైన మరియు ప్రభుత్వ పరంగా మరియు పోతంగల్ కు చేందిన Furnishing details of properties under section 22 A(1)(b) of the registration act,1908 for prohibiition Survey numbers in Pothangal village & mandal division bodhan dist Nizamabad collector and governament of telangana as given clear direction to collector & revenve departmeent and all attach Goverment departments survery number goverment given details as per distic collector revenve records of pothangal village Mandal Pothangal governament of telangana survery number governament land 786/1,166/2/1,166/2/2,166/1/అ1/2,166/1/అ1/1,166/1/అ1/3,169/అ,171/3,171/5/2,171/5/4/1,171/5/4/4/1,171/5/4/4/4/3/2/2/1,171/5/4/4/4/3/1,171/5/4/4/2,171/5/1,171/2,171/5/4/4/4/3/2/1,171/5/3,171/5/4/2,171/5/4/4/3,171/5/4/4/4/2, 172/అ,172/ఆ, 173/ఇ,173/ఈ/1,173/అ/1,198/అ/1,198/అ/2,198/అ/3,214/1/1,541/అ

జిల్లా కాలేక్టర్ అదికారి గార్కి నోటిసు చేయదం జరిగింది ఇంతకముందు గ్రామం తరుపున్న మల్ల మీ దుష్టికి తేవ్వడం జరుగుతుంది పై చుప్ప బడిన గవర్నమేంట్ సర్వే నంబర్స్ ఎడి సర్‌వెయర్ రేవన్యు డిపార్ట్‌మెంట్ గవర్నమెంట్ అదేశల ప్రకారంగా పై చుప్ప బడిన గవర్నమేంట్ సర్వే నంబర్స్ కోలవడం జరిగింది సుమారు ఆరు నెలల క్రితం. మరియు ఇట్టి సర్వే చేసిన తరువాత గవర్నమేంట్ బోన్‌డ్రిస్ గాని మరియు పోతంగల్ రేవన్యు డిపార్ట్‌మెంట్ కు ఇట్టి భూమిని రేవన్యు రికార్డు ప్రకారంగా ప్రభుత్వం అదినంలో పోతంగల్ గ్రామ రేవన్యు చేందిన భూమి ప్రభుత్వం అదినంలో రేవన్యు రికార్డు ప్రకారంగా స్వదినం చేసుకోవల్లి తెలంగాణ ప్రభుత్వం పోతంగల్ గ్రామం , పోతంగల్ రేవన్యు మండలం

note :

పోతంగల్ రేవన్యు మండలం పోతంగల్ గ్రామంలో గవర్నమెంట్ సర్వే నంబర్ గల భూములు అన్ని ప్రభుత్వ అదినంలో ఉండలన్ని కోరుకుంటు కాబ్జ చేసినవలని తోలగించలని కోరుకుంటు విన్నతి పత్రం మికు సమర్పిస్తున్నాము,

copy to
Sub collector,Rdo Bodhan,Thasalidar pothangal , Ad Survery Nizamabad Bodhan,Dist Panchyat Officer Nizamabad(DPO),EEPR Deptarment, MDO Office Pothangal Mandal,Grama Panchayat Seceriate Pothangal, All Deparment Of Government Of Telangana

ఇట్లు
యం. నితిన్ ఉంగంగారం
గ్రా॥ పోతంగల్
మం॥ పోతంగల్

పోతంగల్ గ్రామంలోని ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ వైస్ ఎంపీపీ గంగాధర పటేల్‌తో కలిసి యం. నితిన్ పటేల్ సోమవారం ప్రజావాణిలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల సరిహద్దులు, రెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాప్‌లు, టిప్పన్ మ్యాప్‌లను పరిశీలించి భూములను పరిరక్షించాలని వారు కోరారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. పోతంగల్ గ్రామంలోని పట్టా రెవెన్యూ సర్వే నంబర్ 170/అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ పరిధిలో సుమారు 12 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన సరిహద్దులు, రెవెన్యూ నక్షా, టిప్పన్ రెవెన్యూ మ్యాప్‌లను పరిశీలించి, 1953, 1954, 1955 సంవత్సరాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల ఆధారంగా వివరాలను నిర్ధారించాలని కోరారు.సర్వే నంబర్ 170 చుట్టూ సుమారు 33 అడుగుల రహదారి ఉన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. 2006--2007 సంవత్సరాల్లో మొరం ఫార్మేషన్ రోడ్డు, ఒకవైపు సీసీ రోడ్డు, డ్రెయిన్, మరోవైపు మొరం ఫార్మేషన్ రోడ్డు, కల్వర్టు వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించిన పంచాయతీరాజ్, మండల స్థాయి కొలతల పుస్తకాల రికార్డులను పరిశీలించాలని కోరారు.22-ఏ కింద ప్రభుత్వ భూముల వివరాలు నమోదు చేయాలని వినతి పోతంగల్ గ్రామం, మండల పరిధిలోని ప్రభుత్వ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22-ఏ(1)(బి) ప్రకారం నిషేధిత సర్వే నంబర్ల కింద ఆస్తుల వివరాలను నమోదు చేయాలని వినతిపత్రంలో కోరారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములుగా ఉన్న సర్వే నంబర్లను పరిశీలించి, వాటి సరిహద్దులను గుర్తించి ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలని కోరారు. సుమారు ఆరు నెలల క్రితం సంబంధిత ప్రభుత్వ సర్వే నంబర్లను ఏడీ సర్వేయర్, రెవెన్యూ శాఖ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.సర్వే అనంతరం ప్రభుత్వ భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం తొలగించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులకు ప్రతులు!

వినతిపత్రం ప్రతులను సబ్ కలెక్టర్, ఆర్డీవో బోధన్, తహసీల్దార్ పోతంగల్, ఏడీ సర్వే నిజామాబాద్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నిజామాబాద్, ఈఈపీఆర్, ఎంపీడీవో పోతంగల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పోతంగల్‌తో పాటు తెలంగాణ ప్రభుత్వంలోని సంబంధిత శాఖలకు పంపినట్లు తెలిపారు.పోతంగల్ గ్రామంలోని ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను పూర్తిగా పరిశీలించి, సర్వే నంబర్ల సరిహద్దులను నిర్ధారించి, ఆక్రమణలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని యం. నితిన్ పటేల్ కలెక్టర్‌ను కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు**




**బిచ్కుంద, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ--కామారెడ్డి బ్యూరో):**

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. కామారెడ్డి జిల్లా బిచ్కుందలో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందించాలనే లక్ష్యంతో జుక్కల్ నియోజకవర్గంలో సుమారు 16,564 నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.గత పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుపేద కుటుంబాల రేషన్ కార్డు కలను సాకారం చేసే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ సీమ షెట్కర్, వైస్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్నూర్ రథం గల్లీలో ఘనంగా మహా అన్నదానం

**శ్రీ షేత్కర్ గణేష్ మండపం వద్ద భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం**

**మద్నూర్, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**



మద్నూర్ పట్టణంలోని రథం గల్లీలో శ్రీ షేత్కర్ గణేష్ మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. గణేష్ మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## బజరంగ్ గణేష్ మండలికి బియ్యం, చీరల వితరణ

**అన్నదాన కార్యక్రమానికి సహకారం.. దాతగా ముందుకొచ్చిన కోనేరు శశాంక్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు**

**తగిలేపల్లి, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**




తగిలేపల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన బజరంగ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి సహాయంగా రెండు బియ్యం సంచులు, చీరలను అందజేశారు. బాన్సువాడ బీజేపీ ఇన్‌చార్జి కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా స్వామి వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, ఆకాష్ పాల్గొని గణేష్ మండలి సభ్యులకు బియ్యం సంచులు, చీరలను అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.“సేవ, సహాయం మనది.. ప్రతిఫలం ఆ భగవంతుడిది” అనే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పండుగ వేళ అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించడం ద్వారా సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతగా ముందుకు వచ్చి సహకారం అందించిన కోనేరు శశాంక్‌కు బజరంగ్ గణేష్ మండలి సభ్యులు, తగిలేపల్లి గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గణేష్ మండలి సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు. అన్నదాన కార్యక్రమం

**మాట్లూర్: సెప్టెంబర్ 21(జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం కేంద్రం గ్రామం మదన్ పల్లి. అంబేద్కర్ యువజన గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రాసదం స్వీకరించడం జరిగింది.



# ఎత్తొండలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు కార్డుల అందజేత**

**ఎత్తొండ, సెప్టెంబర్ 21 (జనసంఘర్షణ):**




ఎత్తొండ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ తన చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. పేద, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా గ్రామస్థాయిలో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలను చేపడుతోందని సర్పంచ్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు రేషన్ కార్డుల విషయంలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గతంలో ఇందిరాగాంధీ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, వీధి దీపాలు తదితర పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందని ఆమె పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని సర్పంచ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా తమ వంతు కృషి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.కొత్త రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యకాంత్, తాజా మాజీ ఎంపీటీసీ సయ్యద్ ఫరూక్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

**సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిందన్న నటి**

**ఆన్‌లైన్ జీవితాలతో పోలికలు ఒత్తిడి పెంచుతున్నాయని వివరణ**

**సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి అంతా పరిపూర్ణంగానే కనిపిస్తాయని వ్యాఖ్య**

**నిజ జీవిత సమస్యలు బయటకు కనిపించవని కాజల్ అభిప్రాయం**

**ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై నిఘా ఎక్కువైందని వ్యాఖ్య**

దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co